

బరిలో వీరులు
» గెలుపు ఎవరిదో? - 7లో

భారీగా యువ ఓటర్లు
» విశాఖ జిల్లాలో 2.48 శాతం మంది మొదటిసారి ఓటు హక్కు వినియోగం

ఓటింగ్‌కు వేళాయె..

ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నేడు



- ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు..
- జిల్లాలో మొత్తం ఓటర్లు 15,96,916 మంది
- పురుషులు 7,79,913, మహిళలు 8,16,970, ఇతరులు 33 మంది
- 1,828 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఇవీ..

నియోజకవర్గం	కేంద్రాలు
అనకాపల్లి	251
చోడవరం	243
మాడుగుల	235
పెందుర్తి	299
ఎలమంచిలి	246
పాయకరావుపేట	292
నర్సీపట్నం	262
మొత్తం	1,828

- 340 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- జిల్లా అంతటా 144 సెక్షన్
- ఎన్నికల విధులకు 13 వేల మంది సిబ్బంది



అనకాపల్లి నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకువెళుతున్న ఎన్నికల సిబ్బంది

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనున్నది. జిల్లాలో 15,96,916 మంది ఓటర్ల కోసం 1,828 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అనకాపల్లిలో 12 మంది, నర్సీపట్నంలో 8, చోడవరంలో 6, ఎలమంచిలిలో 10, పెందుర్తిలో 10, పాయకరావుపేటలో 9, మాడుగులలో 9 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరి భవితవ్యాన్ని ఓటరు సోమవారం నిర్ణయించనున్నాడు.

జిల్లాలో ప్రతి పోలింగ్ కేంద్రానికి 8 మంది చొప్పున సిబ్బందిని నియమించారు. ఆదివారం ఉదయం వీరంతా ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల వద్ద రిపోర్టు చేశారు.

అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, ఎలమంచిలి, పాయకరావుపేట, పెందుర్తి నియోజకవర్గ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బంది ఈవీఎంలను, వీవీ ప్యాట్, ఓటరు స్లిప్, ఇంకు బాటిల్ తదితర ఎన్నికల సామగ్రిని ప్రత్యేక వాహనాల్లో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తీసుకు వెళ్లారు.



నర్సీపట్నంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,828 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 15,96,916 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 7,79,913 మంది పురుషులు, 8,16,970 మంది మహిళలు, 33 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 340 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. 380 సూక్ష్మ పరిశీలకులను నియమించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ జరిగేలా ఏర్పాట్లు చేసి, జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పర్యవేక్షిస్తున్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ నేతృత్వంలో ఎన్నికల బందోబస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ విధుల్లో 3 వేలమంది పైచిలుకు పోలీసులు పాల్గొంటున్నారు. ఇప్పటికే కేంద్ర పోలీసు బలగాలు కూడా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించారు.

జిల్లా అంతటా 144 సెక్షన్

జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లపై నిఘా పెట్టారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 48 గంటల పాటు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రానికి నలువైపులా 100 మీటర్ల దూరం వరకు ఎలాంటి ప్రచారాలు చేయవద్దని హెచ్చరించారు. కాగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ బూత్‌ల వద్ద వివిధ హోదాలకు చెందిన 13 వేల మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు.

ఫిర్యాదుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబరు

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు చేయాల్సి వస్తే అనకాపల్లి కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబరు 1960 కు ఫోన్ చేయాలని కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి పి.ప్రసాద్ తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబరు 0892 4226599కు కూడా సమాచారం ఇవ్వవచ్చని పేర్కొన్నారు.



జీవీఎంసీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డీఐజీ విశాల్‌గున్ని

ప్రశాంత ఎన్నికలకు పకడ్బందీ చర్యలు

» డీఐజీ విశాల్‌గున్ని

అనకాపల్లి టౌన్, మే 12: విశాఖ రేంజ్ పరిధిలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని చెప్పారు. ఆదివారం పట్టణంలోని జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమన్వయమై ఆయా సరిహద్దుల్లో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ బలగాలతో విస్తృతంగా నిఘా పెట్టామన్నారు. ముఖ్యంగా రేంజ్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టామన్నారు. రేంజ్ పరిధిలో రౌడీషీటర్లు, అనుమానితులైన 18 వేల మంది పై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. అలాగే రేంజ్ పరిధిలో ఎటువంటి ఆధారాలు లేని రూ.4.5 కోట్ల నగదు, కొంత వెండి, బంగారం వస్తువులను కూడా సీజ్ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, డీఎస్పీ అప్పలరాజులు ఉన్నారు.

అనకాపల్లిని ఐటీ హబ్‌గా మారుస్తా..

» సర్వేల్లో కూటమి అభ్యర్థులదే విజయమని తేలింది
» బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ వెల్లడి

- వార్త 6వ పేజీలో..

వైసీపీ అరాచకాలకు అడ్డే లేదు!

నడింపల్లిలో రైతుల అవసరాల ముసుగులో అక్రమ గ్రావెల్ తవ్వకాలు

- జగనన్న కాలనీకి కేటాయించిన వంతెన సొంత లేఅవుట్‌కు మళ్లింపు
- అభిజిత్ కర్మాగారంలోని స్లాగ్‌నూ వదలని వైనం
- సెజ్‌లో దందాలు
- ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు చెలరేగిపోతున్నారని ఆరోపణలు



నడింపల్లి కొండను తవ్వేసిన దృశ్యం

అచ్యుతాపురం, మే 12:

వైసీపీ పాలనలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల అరాచకాలకు అడ్డే లేకుండా పోయిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, ఓ కర్మాగారంలో స్లాగ్ విక్రయంపై పెత్తనం, సెజ్ కర్మాగారాల్లో దందా.. ఇలా అనేక విషయాల్లో చెలరేగిపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అభివృద్ధిని గాలికి వదిలేసి అక్రమార్జనపై దృష్టి పెట్టారని, వైసీపీ పెద్దల అండదండలు ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో నిర్మిస్తున్న కర్మాగారాల్లో లోతట్టు ప్రాంతాలను కప్పడానికి గ్రావెల్ లక్షల టన్నుల్లో అవసరం కావడంతో వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. మండలంలోని సునపర్తి పంచాయతీ నడింపల్లి కొండను తవ్వడానికి ప్రణాళిక వేశారు. ఈ కొండవాలు ప్రాంతంలో సుమారు 90 ఎకరాల భూమి ఎత్తుపల్లాలతో ఉందని, విశాఖకు చెందిన ఒక ప్రైవేటు సంస్థతో చదును చేయించుకుంటామని అచ్యుతాపురం తహసీల్దార్‌కి రైతులతో దరఖాస్తు చేయించారు. దీంతో గనుల శాఖ సర్వే నంబర్లు 83/1,2, 86, 87, 88, 90లలో సుమారు వందెకరాల్లో గ్రావెల్ తవ్వకానికి విశాఖపట్నానికి చెందిన సంస్థకు అనుమతి ఇచ్చింది. ఒక్కొక్క సర్వే నంబరులో 50 నుంచి 60 వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వాలని గనుల శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. కానీ లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తరలించేశారు. గ్రావెల్ తరలించడానికి నడింపల్లి నుంచి బాబా అటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) ప్రధాన రోడ్డు వరకు దొప్పెర్ల మీదుగా సుమారు మూడు కిలోమీటర్లు మేర రహదారిని 40 అడుగులకు విస్తరించారు. దీని వల్ల జీడి, యూకలిప్టస్ మొక్కలు పోయాయి. దీనికి పరిహారం ఇస్తామని అప్పట్లో నాయకులు రైతులకు చెప్పారు. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

అభిజిత్ స్లాగ్‌పై కన్నేసి..

సెజ్‌లో అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారంలో ఉత్పత్తి అనంతరం స్లాగ్ విడుదల అవుతుంది. దీనిని ఉమ్మడి విశాఖ జిల్లాలో గల సుమారు 235 పాల్‌జీ బ్రిక్ ఇండస్ట్రీ యజమానులు అప్పట్లో ఉచితంగా తీసుకువెళ్లేవారు. ఆ తరువాత కర్మాగార యాజమాన్యం టన్ను రూ.30లుగా నిర్ణయించింది. దీనికి డిమాండ్ పెరగడంతో టన్ను రూ.90 చేసింది. ఈ ధర ఇంకా పెరగకుండా యాజమాన్యానికి ఒక మాట చెప్పాలని విశాఖలో ఓ ప్రజాప్రతినిధిని బ్రిక్ ఇండస్ట్రీ యజమానులు కోరారు. దీనిపై కన్నేసిన ఆ ప్రజాప్రతినిధి నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి నలుగురు నాయకులను నియమించి తామే స్లాగ్ విక్రయించేలా చర్యలు చేపట్టారు. టన్నుకు రూ.30 కమీషన్ ... మిగతా 8వ పేజీలో

పోరు రసవత్తరం

అనకాపల్లి పార్లమెంటు స్థానానికి హోరాహోరీ



సీఎం రమేశ్ | బూడి ముత్యాలనాయుడు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అనకాపల్లి లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానంగా కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ ఉంది. పార్లమెంటు స్థానానికి కూటమి తరపున పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్, వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. ఇక అసెంబ్లీ స్థానాల విషయానికి వస్తే వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. మొత్తమ్మీద అధికార పార్టీ అభ్యర్థులకు ఎదురుగాలి వీస్తున్నట్టుగా ఉంది.

- ప్రచారంలో కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ ముందంజ
- అసెంబ్లీ స్థానాల్లో ద్విముఖ పోటీ
- పలుచోట్ల అధికార పార్టీ అభ్యర్థులకు ఎదురుగాలి

అనకాపల్లి ఎంపీ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అయితే ప్రధాన పోటీ బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్, వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మధ్యే ఉంది. 12 ఏళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా సుదీర్ఘ అనుభవం ఉన్న సీఎం రమేశ్‌తో బూడి ముత్యాలనాయుడు తలపడుతుండడంతో ఇక్కడ పోటీ ప్రతిష్ఠాత్మకంగా మారింది. రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన అనుభవం, కేంద్రంలో బీజేపీ పెద్దలతో తనకున్న సంబంధాలతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, అనకాపల్లి అభివృద్ధికి కృషిచేస్తానని బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థించారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఇక మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా రెండు పర్యాయాలు గెలిచిన అనుభవం, ఎంపీగా అవకాశం ఇస్తే అందుబాటులో ఉండి సేవలు చేస్తానంటూ వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ప్రచారం చేశారు. వీరిద్దరిలో ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతారో చూడాలి.

అసెంబ్లీ స్థానాల్లో..

జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి, పెందుర్తి నుంచి వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలే మళ్లీ బరిలో దిగారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి జరగకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ఎలమంచిలి వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కన్నబాబురాజుకు ప్రత్యర్థిగా జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ బరిలో ఉన్నారు. కన్నబాబురాజు మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టారని సొంత పార్టీ నాయకులే పలుమార్లు వ్యతిరేకించారు. ఆయన దూకుడుగా వ్యవహరిస్తారనే పేరు కూడా ఉంది. ఇక్కడ తెలుగుదేశం బలం జనసేన అభ్యర్థికి కలిసిరానున్నది. చోడవరంలో వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి ప్రత్యర్థిగా టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు బరిలో ఉన్నారు. వీరి మధ్య గట్టి పోటీ ఉంది. నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్‌కి ప్రత్యర్థిగా టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు పోటీలో ఉన్నారు. గత ఐదేళ్లలో మునిసిపాలిటీ పరిధిలో ఉమాశంకర్ గణేశ్ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అయ్యన్నపాత్రుడు వైపు ఓటర్లు మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయి. పెందుర్తి వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ప్రత్యర్థిగా జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పోటీలో ఉన్నారు. అదీప్‌రాజ్ ఈ ఐదేళ్లలో భూ దందాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు కూటమి మేనిఫెస్టోకు ప్రజలు ఆకర్షితులు కావడంతో పంచకర్ల రమేశ్‌బాబుకు కలిసొస్తుందని అనుకుంటున్నారు. ఇక అనకాపల్లి అసెంబ్లీ నుంచి కూటమి జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పోటీ చేస్తున్నారు. ఆయనపై వైసీపీ నుంచి రాజకీయాలకు కొత్త వ్యక్తి అయిన మలసాల భరత్ కుమార్ పోటీ పడుతున్నారు. రాజకీయ అనుభవం ఉన్న కొణతాలకు అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. పాయకరావుపేట వైసీపీ అభ్యర్థిగా విజయనగరం జిల్లా రాజాం నుంచి వైసీపీ ఎమ్మెల్యే కంబాల జోగులు పోటీ చేస్తున్నారు. ప్రత్యర్థిగా టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత బరిలో ఉన్నారు. కూటమి శ్రేణులు పూర్తిస్థాయిలో అనిత విజయం కోసం పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ రసవత్తర పోరు సాగుతోంది. మాడుగుల టీడీపీ అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి బరిలో ఉండగా, ప్రత్యర్థిగా వైసీపీ నుంచి బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధ పోటీలో ఉన్నారు. వీరిద్దరి మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

బస్సుల కోసం పడిగాపులు

» ప్రయాణికులకు తప్పని పాట్లు

అనకాపల్లి టౌన్, మే 12: అనకాపల్లి డిపోలోని 100 బస్సుల్లో 70 బస్సులను ఎన్నికలకు కేటాయించడంతో ప్రయాణికులకు ఆదివారం ఇబ్బందులు తప్పలేదు. పట్టణంలోని పీటీడీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించారు. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రైళ్లు, సుదూర ప్రాంతాల నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అనకాపల్లికి చేరుకుని జిల్లాలోని వివిధ గ్రామాలకు వెళ్లాల్సిన ప్రయాణికులతో కాంప్లెక్స్ రద్దీగా కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులు చాలా వరకు అందుబాటులో లేకపోవడంతో గమ్యస్థానాలకు చేరేందుకు ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం సాగించక తప్పలేదు.



కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఎన్నికల కోలాహలం

సోమవారం జరగనున్న పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అనకాపల్లి, ఎలమంచిలి, నక్కపల్లిల్లో, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



నక్కపల్లి జూనియర్ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రితో వెళుతున్న సిబ్బంది



మాడుగుల ఆర్‌సీఎం స్కూల్‌లో ఎన్నికల సామగ్రిని తీసుకువెళుతున్న సిబ్బంది



ఎలమంచిలిలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, సామగ్రితో వెళుతున్న ఎన్నికల సిబ్బంది



నక్కపల్లిలో బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది



నర్సీపట్నం డిగ్రీ కళాశాల భోజనాల కోసం బారులు తీరిన ఎన్నికల సిబ్బంది



చోడవరం నియోజకవర్గంలో దివ్యాంగులు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేసిన వీల్ చైర్లు



కోటవురట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది



పాయకరావుపేట పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది

అనకాపల్లిని ఐటీ హబ్‌గా మారుస్తా

» ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ వెల్లడి



కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు(అనకాపల్లి), మే 12 : పార్లమెంట్ సభ్యునిగా విజయం సాధించిన తర్వాత అనకాపల్లిని ఐటీ హబ్‌గా మారుస్తానని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానంతో పాటు 7 శాసనసభ నియోజకవర్గాల్లో ప్రముఖ సంస్థలతో సర్వే చేయించానన్నారు. అన్ని సర్వేల్లోనూ పార్లమెంటు స్థానంలోను, 7 శాసన సభ స్థానాల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని తేలిందన్నారు. ఇప్పటి వరకు 6 సర్వేల్లో ఇదే ఫలితం వచ్చిందన్నారు. విజయం సాధించిన వెంటనే ఈ ప్రాంత అభివృద్ధికి అమలు చేయబోయే ప్రణాళికలను వివరించారు. అనకాపల్లిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి గాను వివిధ కంపెనీలతో పరిశ్రమల ప్రతినిధులతో చర్చించబోతున్నానన్నారు. తన నివాసాన్ని అనకాపల్లిలోనే ఏర్పరచుకొని ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానని తెలిపారు. అనకాపల్లి వాసులకు సేవ చేయాలనే నా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నానన్నారు.

దేవరాపల్లిలో పెనుగాలుల బీభత్సం

» పోలింగ్ కేంద్రం వద్ద కూలిన టెంట్లు

» రాత్రి ఏడున్నర గంటలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది



దేవరాపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద నేలకూలిన టెంట్లు

దేవరాపల్లి, మే 12: వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో ఆదివారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. అనంతరం పెనుగాలులు వీచాయి. ఈ ధాటికి పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దేవరాపల్లి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన రెండు టెంట్లు ఒక్కసారిగా నేలకూలాయి. సుమరు అరగంట పాటు వర్షం కురిసి వెలసిన అనంతరం టెంట్లను సరిచేశారు. ఇదిలావుంటే, మాడుగుల నుంచి ఎన్నికల సిబ్బంది రాత్రి ఏడున్నర గంటలకు మండల కేంద్రం దేవరాపల్లి చేరుకున్నారు. వాలాబు, చింతలపూడి, గర్శింగి పంచాయతీలకు ఎన్నికల సిబ్బంది చేరుకోవడం కాస్త ఆలస్యమైంది.



రాత్రి 7.30గంటలకు పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 12: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి జాతర గత మంగళవారంతో ముగిసినప్పటికీ ఆలయానికి భక్తుల తాకిడి తగ్గలేదు. తెల్లవారుజామున అరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో అధికసంఖ్యలో కుటుంబాలు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ చర్యలు చేపట్టారు. క్యూలో ఉన్న భక్తులకు చల్లటి తాగునీటిని అందజేశారు.

ఓటర్ స్లిప్ ఉంటేనే నజరానా

» అచ్యుతాపురంలో వైసీపీ రూ.1,500 పంపిణీ

» పోటాపోటీగా ఓటర్లకు తాయిలాలు

» ఆపై మద్యం బాటిళ్లు..

అచ్యుతాపురం, మే 12: ఓటు హక్కు స్లిప్ కోసం ఓటర్లు నానా యాతన పడుతున్నారు. ఓటరు కార్డులున్నా బీఎల్‌ఓ ఇచ్చే ఓటరు స్లిప్ కోసం తంటాలు పడుతున్నారు. ఇదంతా ఓటరు తమ ఓటు వినియోగించుకోవడానికి కాదు.. అధికార పార్టీ ఇచ్చే నజరానా కోసం.. పూడిమడకలో అధికార పార్టీ నేతలు ఓటుకు రూ.1,500 చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు ఉన్నా ఇవ్వడం లేదు. బీఎల్‌ఓ ఇచ్చిన ఓటరు సమాచార స్లిప్ ఉంటేనే రూ.1,500 ఇస్తున్నారు. దీంతో ఓటర్లు ఓటరు స్లిప్ కోసం బీఎల్‌ఓల వెంట పడుతున్నారు. ఇంతకాలం ఏంచేశారు. సోమవారం ఎన్నికలకు తాము బిజీగా ఉన్నామంటూ విసుక్కుంటున్నారు. వైసీపీ నాయకులు ఓటరు స్లిప్‌పై సంతకం చేసి దానిని సెల్‌లో ఫొటో తీసి ఇస్తున్నారు. ఇక గోవా మద్యం పంపిణీ చేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం వార్త రావడంతో సీసాపై ఉన్న లేబిల్ తీసేసి మద్యం బాటిళ్ల పంపిణీ చేస్తున్నారు.

పాయకరావుపేటలో..

నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల్లో గెలుపు కోసం, అధికారాన్ని దక్కించుకోవడం కోసం ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బరిలో వున్న అభ్యర్థులు సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో తొలిసారిగా ఓటుకు రూ.1,000 చొప్పున పంపిణీ చేశారు. అధికార వైసీపీ సహా, ఎన్‌డీఏ కూటమి తరపున కూడా ఓటర్లకు నోట్లు పంపిణీ చేస్తున్నారు. మందుబాబులకు అవసరమైన మద్యాన్ని కూడా గ్రామాల్లో రెండు రోజులు ముందుగానే సిద్ధం చేసి, మందుబాబులకు అందజేస్తున్నారు. పాయకరావుపేట ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ సెగ్మెంట్ బరిలో వైసీపీ అభ్యర్థిగా కంబాల జోగులు, ఎన్‌డీఏ కూటమి తరఫున (టీడీపీ) అభ్యర్థిని వంగలపూడి అనిత పోటీ చేస్తున్నారు. ఈ ఇరువురి మధ్య ప్రధాన పోటీ వుందని చెప్పాలి. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం కోసం శని,ఆదివారం రెండు రోజులూ ఆ పార్టీల నాయకులు డోర్ టూ డోర్ నగదు పంపిణీ చేయడం విశేషం.



ఓటర్ల స్లిప్‌లు కోసం బీఎల్‌ఓల వద్ద గుమిగూడిన మత్స్యకారులు

అరకు, కొత్తవలస సెక్షన్‌లలో డీఆర్‌ఎం పర్యటన



శివలింగపురం స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్

విశాఖపట్నం, మే 12: వాల్తేరు డివిజన్ పరిధిలోని అరకు, కొత్తవలస సెక్షన్‌ల పరిధిలో డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ ఆదివారం పర్యటించి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. అలాగే, స్టేషన్లలో ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనపై రూపొందించిన ప్రణాళికలను సమీక్షించారు. డబ్లింగ్ పనులు, సొరంగాలు, పాయింట్లు, క్రాసింగ్‌ల పురోగతి, బ్రిడ్జిల నిర్వహణ కార్యకలాపాలు, సైడ్ వాల్ రక్షణ, భద్రతా చర్యలను పరిశీలించారు. నీటి ప్రవాహక ప్రాంతాలలో బురదతో వచ్చే ప్రమాదాలను నివారణకు చేపట్టాల్సిన ప్రత్యేక చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. అక్కడ నుంచి శిలింగపురం, తాడి స్టేషన్లలో తనిఖీలు చేపట్టారు. ఈ పర్యటనలో ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, ఇతర బ్రాంచి అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కుపై నిర్లక్ష్యపు నీడ

ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

» నిర్వహణ కొరవడి శిథిలావస్థకు చేరిన కట్టడాలు

» సమాధులున్న భవనం శ్లాబ్ నుంచి ఊడి పడుతున్న పెచ్చులు

» సందర్శకులకు అడుగడుగునా అసౌకర్యాలు

కృష్ణాదేవిపేట, మే 12: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు సమాధులున్న గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి పార్కు నిర్వహణపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా ఇక్కడి కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అల్లూరి జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు ఈ పార్కు అభివృద్ధికి నిధులు ప్రకటించడం తప్ప, విడుదల కావడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో మంత్రి ఉండే చింతకాయల అయ్యన్నపాత్రుడు సుమారు కోటి రూపాయల నిధులు మంజూరు చేయించి కొంతమేర పార్కును అభివృద్ధి చేశారు. కానీ ఇక్కడ నిర్వహణ పనులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పార్కులోని కట్టడాలు చాలా వరకు అధ్వానంగా మారాయి.



రంగులు వెలిసి కళావిహీనంగా కనిపిస్తున్న పార్కు ముఖద్వారం

పార్కులో సమస్యలు ఇవీ..

పార్కులో పర్యాటకులు కూర్చొనేందుకు అనువుగా ఏర్పాటు చేసిన మూడు షెడ్ల పైకప్పులు రంధ్రాలు పడ్డాయి. కొన్ని పెనుగాలులకు ఎగిరిపోయాయి. రహదారి, మెట్లు, ప్రహరీగోడలు బీటలు వారాయి. పలుచోట్ల టైల్స్ ఊడిపోయి గోతులు ఏర్పడ్డాయి. పార్కులో సమాధులున్న మందిరం శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. మ్యూజియంలోని వీడియో థియేటర్ మరమ్మతుకు గురైంది. అలాగే రంగులు వెలిసిపోయి పార్కు ముఖద్వారం కళావిహీనంగా మారింది. దీంతో ఇక్కడికి వచ్చే పర్యాటకులు అసౌకర్యానికి గురవుతున్నారు.

కార్యరూపం దాల్చని మంత్రుల హామీలు

ఐదేళ్లుగా పార్కు అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు చేసిన ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదు. గత పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.50 లక్షల నిధులు ప్రకటించినప్పటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అలాగే, 2022లో అల్లూరి జయంతి సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి విచ్చేసిన గిరిజన సంక్షేమ శాఖా మంత్రి రాజన్నదొర రూ.66 లక్షల నిధులు ప్రకటించి రెండేళ్లు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా వెచ్చించి పనులు చేపట్టలేదు.



అల్లూరి విగ్రహం వద్ద స్తంభం నుంచి పెచ్చులూడి పడుతున్న దృశ్యం

పార్కులో పాడైన షెడ్లు

సంరక్షకులకు నెలల తరబడి అందని వేతనాలు

ఇదిలావుంటే, పార్కులో పనిచేస్తున్న ముగ్గురు సంరక్షకులకు వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి సకాలంలో వేతనాలు అందడం లేదు. ప్రస్తుతం 42 నెలల వేతనాలు చెల్లించకపోగా, ఏడాది క్రితం ముగ్గురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. బకాయి వేతనాల కోసం సదరు సంరక్షకులు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా ఫలితం లేకపోతోందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అల్లూరి పార్కు అభివృద్ధిపై దృష్టి సారించాల్సిందిగా ఈ ప్రాంత ప్రజలతో పాటు పర్యాటకులు కోరుతున్నారు.



అల్లూరి, గంటందొర సమాధులున్న కట్టం దుస్థితి



పెచ్చులూడిన టైల్స్

ఎన్‌ఏడీ ఫ్లైవోవర్‌పై ప్రమాదం

» డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

» ఫ్లైవోవర్ పైనుంచి కిందకు పడిపోయిన యువకులు

» ఇద్దరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

మర్రిపాలెం (విశాఖపట్నం), మే 12: మితిమీరిన వేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. మరొకరు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరంలోని ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌పై ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...విశాఖ నగరంలోని దొండపర్తి, కంచరపాలెం ప్రాంతాలకు చెందిన ఆరెల్లి పవన్‌కుమార్ (23), తానవరపు కుమార్ (24), గాంధీ (22) గాజువాక నుంచి ద్విచక్ర వాహనంపై ఆదివారం తెల్లవారుజామున నగరంలోకి వస్తున్నారు. వీరి బైక్ ఎన్‌ఏడీ ఫ్లైవోవర్ పైకి వచ్చేసరికి అదుపుతప్పి నేరుగా రోటరీ డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు ఫ్లైవోవర్ పైనుంచి కిందనున్న రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆరెల్లి పవన్‌కుమార్ (23) తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోని మృతి చెందగా, తానవరపు కుమార్, గాంధీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తక్షణం స్పందించి 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించగా కొద్దిసేపటికే తానవరపు కుమార్ మృతిచెందాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో గాంధీ చికిత్స పొందుతున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ చక్రధరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	133.00
లైవ్ ధర	153.00
విత్ స్కిన్	276.00
స్కిన్ లెస్	286.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

బరిలో వీరులు

మరి కొద్ది నిమిషాల్లో సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ఘట్టం పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి సుమారు 50 రోజులుగా ఎన్నికల సందడి మొదలై, అభ్యర్థుల ఎంపిక తరువాత ఉధృత స్థాయికి చేరుకుంది. ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, ఆశావహులు ఇలా... ఒక్కో పార్టీలో ఎంతో మంది పోటీపడి టికెట్లు దక్కించుకున్నారు. వారితో పాటు స్వతంత్రులు కూడా తమ భవితవ్యం తేల్చుకునేందుకు రంగంలో నిలిచారు. మొత్తమ్మీద ప్రక్రియ పూర్తై... చివరకు పోటీలో నిలిచిన వారిలో విజేతలెవరో సోమవారం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పార్లమెంటు నియోజకవర్గాలతో పాటు మొత్తం 15 శాసనసభ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రధాన పోటీ దారుల వివరాలు పాఠకుల కోసం...

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



విశాఖ లోక్‌సభ బరిలో 33 మంది



ఎం.శ్రీభరత్ | బొత్స ఝాన్సీ | పి.సత్యారెడ్డి

విశాఖ లోక్‌సభస్థానం నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా 33 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. తెలుగుదేశం, వైసీపీతో పాటు కాంగ్రెస్, బీఎస్పీ, సమాజ్‌వాదీ పార్టీ, దళిత బహుజనపార్టీ, పిరమిడ్ పార్టీతో కలిపి 18 మంది, మరో 15 మంది స్వతంత్రులు బరిలో నిలిచారు. పి.సత్యారెడ్డి (కాంగ్రెస్), పెదపెంకి శివప్రసాదరావు (బీఎస్పీ), ఎ.విజయభాస్కర్ (ఇండియా ప్రజాబంధు), అచ్చుత బాలాజీ యాదవ్ (భారత్ చైతన్య యువజన), కొంగరపు గణపతి (రిపబ్లికన్), జి.జగదీశ్వరరావు (జైమహాభారత్), జి.దుర్గాప్రసాద్ (భారతీయ రాష్ట్రీయ దళ్), జి.రాజేష్ (నవతరం), చింతాడ సూర్య (నవ భారత్ నిర్మాణ), జాలాది విజయ్ (సమాజ్‌వాదీ పార్టీ), టి.సాయిముకుంద (ప్రజాప్రస్థానం), కేఏ పాల్ (ప్రజా శాంతి), బాన్న రమేష్ (దళిత బహుజన పార్టీ), బి.చల మాజీ (నవరంగ కాంగ్రెస్), వీఎస్. సత్యనారాయణ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్), పి.సత్యవాణి (పిరమిడ్)తో పాటు మరో 15 మంది స్వతంత్రులు పోటీ చేస్తున్నారు. కాగా తెలుగుదేశం పార్టీ నుంచి ఎం.శ్రీభరత్, వైసీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట అసెంబ్లీ స్థానం ఉంది.

అరకు పార్లమెంట్‌కు త్రిముఖ పోరు



కొత్తపల్లి గీత | తనూజారాణి | పి.అప్పలనర్స

అరకు పార్లమెంట్ నియోజకవర్గ స్థానంలో త్రిముఖ పోటీ నెలకొంది. బరిలో 13 మంది అభ్యర్థులుండగా, ప్రధానంగా కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత, వైసీపీ అభ్యర్థి తనూజారాణి మధ్య హోరాహోరీ పోటీ సాగుతోంది. ఇండియా కూటమి నుంచి సీపీఎం అభ్యర్థిగా బరిలోకి దిగిన పి.అప్పలనర్స గట్టిపోటీ ఇస్తారంటున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, అరకులోయ, రంపచోడవరం పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, కురుపాం, పార్వతీపురం, పాలకొండ అసెంబ్లీ స్థానాలు నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. మొత్తం 15,54,633 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 7,53,709 మంది, మహిళలు 8,00,813 మంది, ఇతరులు 111 మంది ఉన్నారు. మరో పది మంది ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు.

అనకాపల్లి ఎంపీ పీఠానికి ద్విముఖ పోరు!



సీఎం రమేశ్ | బూడి ముత్యాలునాయుడు



వేగి వెంకటేశ్

అనకాపల్లి ఎంపీ స్థానానికి 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచినా ప్రధాన పోరు బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్, వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు మధ్యే నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నుంచి వేగి వెంకటేశ్ పోటీలో ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, ఎలమంచిలి, పెందుర్తి, పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కూటమి సీఎం రమేశ్‌ను రంగంలోకి దింపడంతో వైసీపీ అదే సామాజికవర్గానికి చెందిన బూడి ముత్యాలు నాయుడును బరిలో నిలిపింది.

'దక్షిణం'లో రసవత్తర పోరు



వంశీకృష్ణ శ్రీనివాస్ | వాసుపల్లి గణేష్‌కుమార్ | వాసుపల్లి సంతోష్‌కుమార్

విశాఖ దక్షిణ నియోజకవర్గం బరిలో 16 మంది నిలిచినప్పటికీ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ మధ్యనే పోటీ నెలకొంది. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బరిలో నిలిచారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి సంతోష్‌కుమార్, జైభారత్ పార్టీ నుంచి ఎర్రంశెట్టి సురేష్‌కుమార్, బీఎస్పీ నుంచి కదిరిరాము, మరో 11 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

'పశ్చిమ' బరిలో 13 మంది



పీజీవీఆర్ నాయుడు (గణబాబు) | ఆడారి ఆనంద్‌కుమార్ | అత్తిలి విమల

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోరు టీడీపీ, వైసీపీ మధ్యే నెలకొంది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ (కూటమి) అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) బరిలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థిగా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పోటీలో ఉన్నారు. కాగా సీపీఐ అభ్యర్థిగా అత్తిలి విమల, బీఎస్పీ నుంచి అతుకుంశెట్టి రామచంద్రరావు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి బొట్టా కోటేశ్వరరావు, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి వెంకట గణేశ్ జగ్గుమంత్రి, సమాజ్‌వాద్ పార్టీ నుంచి రవికుమార్ వెలగాడ, జాతీయ జనసేన పార్టీ నుంచి మండపాటి శ్రీనివాసరాజు, మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

అనకాపల్లి బరిలో 12 మంది



కొణతాల రామకృష్ణ | మలసాల భరత్‌కుమార్ | ఐఆర్ గంగాధర్

జిల్లా కేంద్రమైన అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, వైసీపీ నుంచి మలసాల భరత్‌కుమార్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఐఆర్ గంగాధర్, బహుజన సమాజ్ పార్టీ నుంచి సూదికొండ మాణిక్యాలరావు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి కనిశెట్టి సురేష్‌బాబు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి ఒమ్మి వెంకటయాదవ్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పొలమరశెట్టి అంబికా దేవి, ప్రజాప్రస్థానం నుంచి తోట వెంకటసాయిముకుంద, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి దొమ్మేసి అప్పారావు, ప్రేమ్ జనతాదళ్ నుంచి సూరిశెట్టి వీవీ రామచంద్రరావు, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.

చోడవరంలో ముఖాముఖీ



కేఎస్ఎన్ఎస్ రాజు | కరణం ధర్మశ్రీ | జగతా శ్రీనివాసరావు

అనకాపల్లి జిల్లాలో అతి తక్కువగా ఆరుగురు అభ్యర్థులు పోటీపడుతున్న చోడవరం నియోజకవర్గంలో నాలుగోసారి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, వైసీపీ అభ్యర్థిగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తలపడుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పాయకరావుపేటకు చెందిన జగతా శ్రీనివాసరావు, బీఎస్పీ అభ్యర్థిగా వేగి మహాలక్ష్మినాయుడు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అభ్యర్థిగా సవరాల గణేశ్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా పేరిచర్ల వివేకరాజు బరిలో ఉన్నారు.

తూర్పులో ముఖాముఖి



వెలగపూడి రామకృష్ణబాబు | ఎంవీవీ సత్యనారాయణ | గుత్తుల శ్రీనివాసరావు

విశాఖ తూర్పు నియోజకవర్గంలో మొత్తం 14మంది పోటీలో ఉన్నారు. కూటమి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బరిలో ఉన్నారు. వైసీపీ నుంచి విశాఖ లోక్‌సభ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. పోటీలో 15మంది ఉన్నప్పటికీ వెలగపూడి, ఎంవీవీ సత్యనారాయణ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. గుత్తుల శ్రీనివాసరావు(కాంగ్రెస్), జోసఫ్ పీటర్ (బీఎస్పీ), అదపాక దాలిరాజు (నవభారత నిర్మాణ పార్టీ), కె.గణపతి (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), తోట వెంకట సాయి ముకుందు (ప్రజాప్రస్థానం పార్టీ), యడ్ల వేణుగోపాలకృష్ణ (భారతీయ చైతన్య యువజన పార్టీ), ఇ.హైమావతి (పిరమిడ్ పార్టీ), మరో ఐదుగురు ఇండిపెండెంట్లు పోటీ చేస్తున్నారు.

గాజువాకలో ద్విముఖ పోటీ



పల్లా శ్రీనివాసరావు | గుడివాడ అమర్‌నాథ్ | ఎం.జగ్గు నాయుడు

గాజువాక నియోజకవర్గంలో ద్విముఖ పోటీ నెలకొంది. మొత్తం 14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. తెలుగుదేశం పార్టీ (కూటమి) అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఇంకా ఇండియా కూటమి నుంచి సీపీఎం అభ్యర్థిగా ఎం.జగ్గునాయుడు, ప్రజాశాంతి నుంచి కేఏ పాల్, ఎన్.అప్పారావు (బీఎస్పీ), టి.అక్కయ్య (లోకతంత్రిక్ జనతాదళ్), శ్యాముల్ జాన్ ధర్మరాజు రాయపాటి (దళిత బహుజన), తలపుల శైలజ (ప్రజాప్రస్థానం), కాండ్రేగుల ఆదినారాయణ (జై మహాభారత్), బత్తుల నీలకంఠం (నవభారత్ నిర్మాణ సేవ), సుంకర సారజ్యోతి (నవతరం పార్టీ), మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.

నర్సీపట్నంలో గట్టి పోటీ!



చింతకాయల అయ్యన్నపాత్రుడు | పెట్ల ఉమా శంకర్ గణేశ్ | రుత్తల శ్రీరామమూర్తి

నర్సీపట్నంలో ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు, వైసీపీ అభ్యర్థిగా పెట్ల ఉమాశంకర్ గణేశ్ తలపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రుత్తల శ్రీరామమూర్తి, బీఎస్పీ అభ్యర్థిగా బొట్టా నాగరాజు, జై భీంరావు భారత్ పార్టీ అభ్యర్థిగా నేతల నాగేశ్వరరావు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి జోగా చంద్రమౌళి, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యే పోటీ జరగనుంది.

మాడుగులకు కొత్త ముఖాలు



బండారు సత్య నారాయణమూర్తి | ఈర్లె అనురాధ | బొడ్డు బుచ్చి సత్యశ్రీనివాసరావు

మాడుగులలో తొమ్మిది మంది పోటీలో ఉన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి తలపడుతున్నారు. వైసీపీ నుంచి ఈర్లె అనురాధ పోటీ పడుతున్నారు. ఈమె డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకుమార్తె. ప్రస్తుతం కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు. వీరిద్దరి మధ్య గట్టిపోటీ ఉంది. కాంగ్రెస్ నుంచి బొడ్డు బుచ్చి సత్యశ్రీనివాసరావు, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తొలి భార్య కుమారుడు బూడి రవికుమార్, మల్లారపు లోవ, మతల ఆదినాయుడు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తుండగా, బీఎస్పీ, ఇతర పార్టీల నుంచి కరణం తిరుపతిరావు తాళ్ల రవి, లెక్కల ఈశ్వరరావు బరిలో నిలిచారు.

ఎలమంచిలిలో పోటీ పోటీ



సుందరపు విజయకుమార్ | యూవీ రమణ మూర్తిరాజు | తనకాల అనంత రామ నరసింగరావు

ఎలమంచిలి నియోజకవర్గ బరిలో పది మంది అభ్యర్థులు నిలిచారు. ఎన్డీఏ నుంచి సుందరపు విజయకుమార్, వైసీపీ అభ్యర్థిగా యూవీ రమణమూర్తి రాజు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తనకాల అనంత రామనరసింగరావు, బీఎస్పీ నుంచి లంబా శ్రీనివాసరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బి.అమ్మాజమ్మ, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి అరుణ్ కుమార్ సుందరపు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి దాడి పూర్ణచంద్రరావు, రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బోజా నాగేశ్వరరావు, ఇద్దరు స్వతంత్రులు పోటీలో ఉన్నారు.

'నార్త్'లో ముక్కోణం



విష్ణుకుమార్‌రాజు | కేకే రాజు | వీవీ లక్ష్మీనారాయణ

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో మొత్తం 15 మంది పోటీలో ఉన్నారు. కూటమి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు బరిలో ఉన్నారు. అధికార వైసీపీ నుంచి కేకే రాజు పోటీ చేస్తున్నారు. జై భారత్ పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన.. ఆ తరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సొంతంగా పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎల్.రామారావు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి గుంపుల శరత్‌బాబు, నవభారత్ నిర్మాణ సేవ పార్టీ నుంచి చింతాడ సూర్యం, జాతీయ జనసేన పార్టీ నుంచి పి.జగదీశ్, మరో ఏడుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.

భీమిలిలో మిత్రుల యుద్ధం



గంటా శ్రీనివాసరావు | ముత్తంశెట్టి శ్రీనివాసరావు | అద్దాల వెంకట వర్మరాజు

భీమిలి నియోజకవర్గంలో మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో చిరకాల మిత్రులు వైసీపీ నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తెలుగుదేశం నుంచి గంటా శ్రీనివాసరావుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఇంకా కాంగ్రెస్ నుంచి అద్దాల వెంకట వర్మరాజు, బీఎస్పీ నుంచి భాగం గోపాలరావు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి అనిల్‌కుమార్ ఇలిపిల్లి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా కోలా హరిబాబు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు, సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థిగా రాజు చోడిపల్లి, మరో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

అరకులో బహుముఖం



పాంగి రాజారావు | రేగం మత్స్యలింగం | శెట్టి గంగాధర్‌స్వామి

అరకులో బహుముఖ పోటీ నెలకొంది. మొత్తం 17 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, ప్రధానంగా ఐదుగురి మధ్య పోటీ నెలకొంది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నుంచి పాంగి రాజారావు, వైసీపీ నుంచి రేగం మత్స్యలింగం బరిలో నిలిచారు. ప్రధానంగా వీరిద్దరి మధ్య హోరాహోరీ పోటీ సాగుతోంది. శెట్టి గంగాధర్‌స్వామి (కాంగ్రెస్), లకే రాజారావు (బీఎస్పీ) స్వతంత్ర అభ్యర్థి సీవేరి అబ్రహం, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి కిల్లో అనిల్‌కుమార్, దండకారణ్య పార్టీ నుంచి చుంచు రాజుబాబు గోండ్వానా, జై భారత్ జాతీయ పార్టీ నుంచి బురిడి ఉపేంద్ర, భారత్ ఆదివాసీ పార్టీ నుంచి డాక్టర్ రామకృష్ణ పుచ్చపుండి, మరో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

'పేట'లో ద్విముఖ పోటీ



వంగలపూడి అనిత | కంబాల జోగులు | డాక్టర్ బోని తాతారావు

పాయకరావుపేట ఎస్సీ నియోజకవర్గంలో తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్య పోటీ నెలకొంది. ఎన్డీఏ కూటమి అభ్యర్థినిగా తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, వైసీపీ నుంచి విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ నుంచి డాక్టర్ బోని తాతారావు, బహుజన సమాజ్ పార్టీ నుంచి కాకర నరసింహారావు, దళిత బహుజన పార్టీ నుంచి వడ్డమూరి కృష్ణస్వరూప్, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి దూలపల్లి నాగేశ్వరరావు, ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ నుంచి పతివాడ రామకృష్ణ, ఇద్దరు స్వతంత్రులు పోటీలో ఉన్నారు.

పాడేరులో రసవత్తరం



గిడ్డి ఈశ్వరి | మత్స్యరాస విశ్వేశ్వరరాజు | సతకా బుల్లిబాబు

పాడేరు అసెంబ్లీ స్థానంలో మొత్తం 16 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గిడ్డి ఈశ్వరి (టీడీపీ), మత్స్యరాస విశ్వేశ్వరరాజు (వైసీపీ), సుర్ల అప్పారావు (బీఎస్పీ), సతకా బుల్లిబాబు (కాంగ్రెస్), కింటుకూరి జోసెఫ్ (ఇండియా ప్రజాబంధు పార్టీ), మినుముల రాంబాబు (సమాజ్ వాదీ పార్టీ), కిల్లో రంగారావు (భారత చైతన్య పార్టీ), దమంతి నాగేశ్వరరావు (జైభారత్ నేషనల్ పార్టీ), బొంకు అర్జునరావు (జై మహాభారత్ పార్టీ), మరో ఏడుగురు స్వతంత్రులు పోటీ చేస్తున్నారు.

పెందుర్తిలో నువ్వా... నేనా?



పంచకర్ల రమేశ్‌బాబు | అన్నంరెడ్డి అదీప్‌రాజ్ | పిరిడి భగత్

పెందుర్తి నియోజకవర్గంలో మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ, కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బరిలో ఉన్నారు. వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పోటీ చేస్తున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ నుంచి పిరిడి భగత్, బీఎస్పీ నుంచి బంగారి రమణ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఈత రోజ, నేషనలిస్ట్ జనశక్తి నుంచి ఏలూరు వెంకటరమణ జైభారత్ నేషనల్ పార్టీ నుంచి కన్నేపల్లి మహదేవ్, నవరంగ్ కాంగ్రెస్ నుంచి పి.రమేశ్ నాయుడు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి బోలెం వెంకట మురళీమోహన్, మరో ఐదుగురు స్వతంత్రులుగా బరిలో ఉన్నారు.

భారీగా యువ ఓటర్లు

విశాఖ జిల్లాలో 2.48 శాతం మంది మొదటిసారి ఓటు హక్కు వినియోగం

- జిల్లా వ్యాప్తంగా 20,12,373 మంది ఓటర్లు... వీరిలో 18-19 ఏళ్లలోపు యువతీయువకులు 49,935 మంది
- అత్యధికంగా భీమిలిలో 9,469 మంది, గాజువాకలో 8,408, పెందుర్తిలో 8,026 మంది ఓటర్లు
- 'నార్త్'లో అన్నింటి కంటే తక్కువగా 4,479 మంది

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతీయువకుల సంఖ్య విశాఖపట్నం జిల్లాలో భారీగానే ఉంది. అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక డ్రైవ్‌ల ఫలితంగా భారీసంఖ్యలో యువత ఓటు హక్కును నమోదు చేయించుకున్నారు. వీరంతా సోమవారం ఓటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 49,935 మంది కొత్తగా ఓటు హక్కును పొందారు. మొత్తం ఓటర్లతో పోలిస్తే వీరి సంఖ్య 2.48 శాతంగా ఉంది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే...కొత్త ఓటర్లు భీమిలిలో 9,469 మంది నమోదు కాగా, వీరిలో 5,200 మంది పురుషులు, 4,269 మంది మహిళలు ఉన్నారు. అలాగే విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలో 7,499 మందిలో పురుషులు 3,912 మంది, మహిళలు 3,586 మంది, దక్షిణ నియోజకవర్గంలో 4,479 మందిలో 2,396 మంది పురుషులు, 2,083 మంది మహిళలు, నార్త్ నియోజకవర్గంలో 6,617 మంది కొత్త ఓటర్లు ఉండగా 3,553 మంది పురుషులు, 3,064 మంది మహిళలు, పశ్చిమ నియోజకవర్గంలో 5,437 మందిలో 2,863 మంది పురుషులు, మహిళలు 2,573 మంది ఉన్నారు. గాజువాక నియోజకవర్గంలో 8,408 మంది యువ ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 4,523 మంది, మహిళలు 3,885 మంది, పెందుర్తి నియోజకవర్గంలో 8,026 మందిలో పురుషులు 4,356 మంది, మహిళలు 3,670 మంది ఉన్నారు.



రెండు శాతానికిపైగానే..

విభజిత విశాఖ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ రెండు శాతానికి పైగానే తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబో తున్నారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో అత్యధికంగా 2.6 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకుంటుండగా, విశాఖ తూర్పులో 2.56 శాతం మంది యువత ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. విశాఖ పశ్చిమలో 2.54 శాతం మంది, గాజువాకలో 2.52 శాతం మంది, విశాఖ ఉత్తరంలో 2.31 శాతం మంది, విశాఖ దక్షిణలో 2.06 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు యువ ఓటర్లు సిద్ధమవుతున్నారు.

నియోజక వర్గాలు వారీగా వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	తొలి ఓటర్లు	శాతం
భీమిలి	1,78,068	1,84,928	17	9,469	2.6
విశాఖ తూర్పు	1,42,546	1,49,639	21	7,499	2.56
విశాఖ దక్షిణ	1,06,454	1,10,282	34	4,479	2.06
విశాఖ ఉత్తర	1,40,810	1,44,956	23	6,617	2.31
విశాఖ పశ్చిమ	1,05,207	1,08,221	11	5,437	2.54
గాజువాక	1,67,125	1,66,473	13	8,408	2.52
పెందుర్తి	1,52,592	1,54,948	05	8,026	2.6

పోలింగ్‌కు సర్వం సిద్ధం

▸▸ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు ▸▸ పోలింగ్ కేంద్రాలకు తరలిన సామగ్రి, సిబ్బంది ▸▸ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు



నక్కపల్లి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తీసుకుని బయల్దేరుతున్న సిబ్బంది

నక్కపల్లి, మే 12: పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ అధికారుల పర్యవేక్షణ, బందోబస్తుతో ఆదివారం మధ్యాహ్నం నుంచి తరలించారు. నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.గీతాంజలి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో రూ 2,50,744 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1,23,363 మంది వుండగా, మహిళా ఓటర్లు 1,27, 379 మంది వున్నారు. కోటవురట్ల మండలంలో 44,459 మంది, పాయకరావుపేటలో 79,476 మంది, నక్కపల్లిలో 65,289 మంది, ఎస్.రాయవరంలో 61,520 మంది ఓటర్లు ఉన్నారు. పలు ప్రాంతాల నుంచి ఎన్నికల విధులు నిర్వహించేందుకు తరలివచ్చిన ఎన్నికల సిబ్బంది తమకు అల్పాహారం సరిగా పెట్టలేదని ఆవేదన వెలిబుచ్చారు

ఎలమంచిలిలో..

ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఎన్నికల సామగ్రి, ఈవీఎంలను ఎన్నికల సిబ్బందికి ఆదివారం అందజేశారు. మొత్తం 28 కౌంటర్ల ద్వారా పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. ఎన్నికల సామగ్రిని పోలింగ్ సిబ్బందిని 21 రూట్లలో తరలించారు. నియోజకవర్గంలోని 22 గ్రామాలను పరిధిలో 49 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. నియోజకవర్గంలోని 246 పోలింగ్ కేంద్రాల్లో 2,06,394 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 1,00,407, మహిళలు 1,05978 మంది, ట్రాన్స్‌జెండర్స్ 9 మంది ఉన్నారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ పర్యవేక్షణలో 550 మంది పోలీసు, ప్రత్యేక పోలీసు బలగాలను నియమించారు. కాగా నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు వచ్చిన సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనంపై సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరిలో కొందరికి భోజనాలు అందలేదు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని రిటర్నింగ్ అధికారి కె.మనోరమ తెలిపారు. ప్రజలంతా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలింగ్ నిర్వహణకు గాను 246 మంది పీవోలు, 246 మంది ఏపీవోలు, 21 మంది మైక్రో అబ్జర్వర్లను, 21 మంది సెక్టార్ అధికారులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



ఎలమంచిలిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బంది కోలాహలం

అనకాపల్లిలో...

అనకాపల్లి రూరల్: అనకాపల్లి ఎంపీ స్థానంతో పాటు అసెంబ్లీ నియోజకర్గానికి సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం సిద్ధమైంది. అనకాపల్లి నియోజకవర్గానికి సంబంధించి 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. వీటిని 25 సెక్టార్లుగా విభజించి ఎన్నికల సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు రవి పట్టన్‌శెట్టి నియమించారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,13,714 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,03088 మంది, మహిళలు 1,10621 మంది, ఇతరులు ఐదుగురు ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,259 మంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికలు సామగ్రి పంపిణీకి ఫ్యూచర్ వరల్ పాఠశాల ప్రాంగణంలో డిస్ట్రిబ్యూషన్ కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బందికి సూచనలను జేసీ జాహ్నవి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ చేశారు. మధ్యాహ్నం భోజనాలు చేసిన తర్వాత వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది సామగ్రిని తీసుకువెళ్లారు.

పెందుర్తిలో.. సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి సర్వం సిద్ధం చేశారు. 'పెందుర్తి' ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులు ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ, పెదగంట్యాడ మండలాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 3,07,545 మంది ఓటర్లకుగాను వీరిలో పురుషులు 1,52,592, మహిళలు 1,54,948 మంది, ట్రాన్స్‌జెండర్స్ ఐదుగురు ఉన్నారు. వీరి కోసం 299 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు.

పాయకరావుపేటలో.. పాయకరావుపేట మండలంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రానికి మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్దకు ఓటింగ్ యంత్రాలతో ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. మండలంలో మొత్తం 78,427 మంది ఓటర్లుండగా..వీరిలో పురుష ఓటర్లు 39,060, మహిళలు 39,367 ఓటర్లు ఉన్నారు. వీరికోసం 90 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.



అనకాపల్లి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బంది సందడి

ఎస్.రాయవరంలో.. మండలంలో ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లును సంబంధిత ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. మండలంలో 75 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 61,520 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 29, 714 మంది, మహిళలు 31,804 మంది, ఇద్దరు ట్రాన్స్‌జండర్స్ ఉన్నారు. వచ్చిన ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లు, తాగునీరు తదితర వసతులను ఏర్పాటు చేశారు.

కోటవురట్లలో.. సార్వతిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు పోలింగ్ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఐదు నుంచి ఆరుగురు సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు."పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయలు కల్పించినట్టు ఆయన తెలిపారు.మండలంలో పురుషులు 21,634 మంది, మహిళలు 22,653 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మండలంలో రామచంద్రపురం, పందూరు, గొట్టివాడ, కైలాసపట్నం, పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వెంకటరమణ, డీటీ అన్నారావు మౌలిక సదుపాయలు పరిశీలించారు.

అచ్యుతాపురంలో.. మండలంలో ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధంచేశారు. మండలంలో 61,626 మంది ఓటర్లు ఉండగా.. అందులో పురుషులు 30,189 మంది, మహిళలు 31, 437 మంది ఉన్నారు. పోలింగ్ స్టేషన్లు 72 ఉన్నాయి. పూడిమడకలో అత్యధికంగా పది బూతులున్నాయి.

రాంబిల్లిలో.. మండలంలో ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ బూతుల వద్ద ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారు. 306 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని 51 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 42,134 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 20,484 మంది పురుషులు, 21,650 మహిళలు ఉన్నారన్నారు. కాగా ఉదయం 7 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకు ఎలక్షన్ జరుగనుందని మండల ఎన్నికల అధికారి, అప్పలస్వామి తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉందన్నారు.

పరవాడలో.. సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మండలంలో 64,459 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 31,387 మంది, మహిళలు 32,564 మంది ఉండగా ఇద్దరు ట్రాన్స్‌జండర్స్ ఉన్నారు. వీరందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు మండల వ్యాప్తంగా 63 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ ఎస్. గణపతిరావు తెలిపారు. మండలంలో 378 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటారన్నారు.

సబ్బవరంలో.. మండలంలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలో 59,542 మంది ఓటర్లు ఉండగా... అందులో పురుషులు 29,143 మంది, మహిళలు 20,398, ట్రాన్స్‌జండర్ ఒకరు ఉన్నారు. మండల పరిధిలో 68 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సబ్బవరం మేజరు పంచాయతీలో అత్యధికంగా 10,526 మంది ఓటర్లు ఉండగా... నల్లరేగులపాలెంలో అత్యల్పంగా 648 మంది ఓటర్లు ఉన్నారు.

గ్రీన్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు



నక్కపల్లిలో ఏర్పాటు చేసిన గ్రీన్ పోలింగ్ స్టేషన్

నక్కపల్లి, మే 12: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈసారి పలు గ్రామాల్లో గ్రీన్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఓటర్లను ఆకట్టుకోవడం కోసం నిర్దేశించిన పోలింగ్ కేంద్రాల వద్ద గ్రీనరీ వుండేలా ఏర్పాట్లు చేశారు. పలు రకాల వృక్ష సంపదను పోలింగ్ కేంద్రాల ప్రవేశ ద్వారాలు వద్ద ఏర్పాటు చేశారు. నక్కపల్లి, రాజయ్యపేట, పెదదొడ్డిగల్లు, పెదతీనార్ల, కాగిత గ్రామాల్లోని కొన్ని పోలింగ్ స్టేషన్లను గ్రీన్ పోలింగ్ స్టేషన్లుగా ఏర్పాటు చేశారు. ఇలా నియోజకవర్గంలో 30 వరకూ ఏర్పాటు చేశారు.



పాయకరావుపేట ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాల ఎదుట వేసిన టెంట్లు



అనకాపల్లిలో ఎన్నికల సామగ్రితో బయలుదేరిన ఎన్నిక సిబ్బంది



నక్కపల్లిలో ఎన్నికల సామగ్రితో బస్సు ఎక్కుతున్న సిబ్బంది



ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారంలో పోలింగ్ కేంద్రం వద్ద వేసిన టెంట్

ఘనంగా ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యుల జయంతి

పరవాడ, మే 12 : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రావాడ రామాలయం వద్ద ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యుల చిత్రపటాలకు ఫౌండేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి, ఈశ్వరమ్మ, వరలక్ష్మి, ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు, సభ్యులు ఎలమర్తి వెంకటరమణ, పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం రమేశ్

కొత్తూరు, మే 12 : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీలో ఉన్న కనకదుర్గమ్మను బీజేపీ పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో దిగ్విజయంగా జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



గెడ్డం బుజ్జి సమక్షంలో జనసేన పార్టీలో చేరిన కార్యకర్తలు

జనసేన పార్టీలో పలువురి చేరిక

పాయకరావుపేట రూరల్, మే12 : మండలంలోని గుంటపల్లిలో ఆదివారం నక్కపల్లి మండలం ఉద్దండపురం, దోసలపాడు గ్రామాలకు చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. వీరికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సీఎం.రమేశ్, వంగలపూడి అనితలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్దండపురం మాజీ ఉప సర్పంచ్ బొల్లవ రమణ, తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి : సీఐ

సబ్బవరం, మే 12 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని సీఐ పిన్నింటి రమణ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓటర్లు అంతా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పక్కా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే వికలాంగులుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. వారిని పోలింగ్ కేంద్రానికి తరలించేందుకు ఎన్నికల సంఘం ట్రై సైకిళ్లు సిద్ధం చేసిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాల మధ్య ఎన్నికలు జరుగుతాయన్నారు. బీఎల్‌వోలు ఇచ్చిన ఓటరు స్లిప్‌లను మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఇతర పార్టీల నేతలు ఇచ్చే గుర్తు కలిగిన స్లిప్‌లు అనుమతించరన్నారు. ఎవరైన అక్రమాలకు పాల్పడితే తమకు కానీ, 100కు కానీ సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంతో 800 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. 68 పోలింగ్ కేంద్రాల పరిధిలో పక్కాగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ పిన్నింటి రమణ

వైసీపీ అరాచకాలకు అడ్డేలేదు!

... 5వ పేజీ తరువాయి

డిమాండ్ చేసిన ఆ నాయకులు దానిని రూ.70కి పెంచారు. దీంతో ప్రస్తుతం టన్ను స్లాగ్ ధర రూ.270కి చేరింది.

ప్రజల సొమ్ముతో సొంత లేఅవుట్‌కి వంతెన

రాంబిల్లి మండలం వెంకటాపురం సర్వే నంబర్ 142లోని కొండవాలులో గల జగనన్న కాలనీకి వెళ్లడానికి ఊటగెడ్డపై వంతెన నిర్మాణానికి పంచాయతీ అధికారులు రూ.20 లక్షలు మంజూరు చేస్తే అధికార పార్టీ నాయకుడు ఆ వంతెనను తన కుమారుడు భాగస్వామిగా ఉన్న లేఅవుట్‌కు నిర్మించుకున్నారు. అలాగే అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిలో గల ఏపీ గురుకుల పాఠశాల కోసమని చెప్పి ఆ పక్కనే ఉన్న తన ఎస్టేట్‌కు ఓ ప్రజాప్రతినిధి రోడ్డు నిర్మించుకున్నారు. కాగా వైసీపీకి చెందిన ఓ ఎంపీటీసీ సభ్యుడు సెజ్‌లో ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న పదెకరాలు భూమిలో సాగుచేసుకుంటున్నారు. అందులో ఉన్న రెండు బావుల్లోని నీటిని ట్యాంకర్ల ద్వారా సెజ్ కర్మాగారాలకు సరఫరా చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. అంతే కాకుండా కొందరు వైసీపీ నాయకులు నిర్వాసితుల పేరుతో సెజ్ కర్మాగారాల్లో దందాలు నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వర్షం కురిస్తే రోడ్లపైనే నీరు

▸▸ రాకపోకలకు అవస్థలు పడిన ప్రజలు



ఎలమంచిలి కొత్తపేట ప్రధాన రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

ఎలమంచిలి, మే 12: పట్టణంలో ఇటీవల కురిసిన వర్షానికి పలు చోట్ల రోడ్లపైనే వర్షం నీరు నిలిచిపోవడంతో పట్టణ ప్రజలు అవస్థలు పడ్డారు. ప్రధాన రోడ్డుపై ఎల్ఐసీ కార్యాలయం వద్ద డ్రైనేజీ మురుగు, వర్షం నీరు కలిసి రోడ్డుపై నుంచి ప్రవహించింది. అదేవిధంగా పట్టణంలోని కొత్తపేట కాలనీ ప్రధాన రోడ్డుపై ఎప్పటిలాగానే వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోయింది. వర్షం కురిసేటప్పుడు రోడ్లపై నీరు నిలిచిపోతున్న సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నా అటు పాలకులు గానీ, మునిసిపల్ అధికారులు గానీ దృష్టి సారించకపోవడం పట్ల పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్యకు మోక్షం కలుగుతుందని ఆశించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. మునిసిపల్ అధికారులపై నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన పాలకులు ఆ దిశగా దృష్టి సారించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సులు లేక అవస్థలు

నర్సీపట్నం, మే 12 : ప్రజా రవాణా శాఖ నర్సీపట్నం డిపో నుంచి 80 బస్సులను పోలింగ్ సిబ్బంది, సామగ్రి తరలింపునకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నర్సీపట్నం నియోజకవర్గానికి 40 బస్సులు, ఇతర నియోజకవర్గాలకు 40 బస్సులను పంపిచారు. దీంతో ఆదివారం డిపోలో బస్సులు అందుబాటులో లేక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు కాంప్లెక్స్ గంటలకొద్ది వేచి ఉండాల్సి వచ్చింది.


పోలింగ్ సిబ్బందిని ఆయా బూత్‌లకు తరలించేందుకు చోడవరం పాఠశాల మైదానంలో సిద్ధంగా ఉన్న వాహనాలు


మాడుగుల నుంచి ఎన్నికల విధులకు వెళుతున్న సిబ్బందికి ఆర్‌సీఎం పాఠశాలలో సూచనలిస్తున్న ఆర్‌వో, ఉన్నతాధికారులు


నర్సీపట్నం డిగ్రీ కళాశాల నుంచి ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు బయల్దేరుతున్న సిబ్బంది

నేడే ఓట్ల పండగ

- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు వరకు పోలింగ్
- ఆ తరువాత పోలింగ్ కేంద్రంలోని క్యూలో ఎంతమంది ఉన్నా ఓటు వినియోగించుకునే అవకాశం
- ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఓటరు జాబితాల సమాచారంతో కేంద్రాలకు తరలి వెళ్లిన సిబ్బంది

నర్సీపట్నం, మే 12 : మరికొద్ది గంటల్లో సార్వత్రిక ఎన్నికల సమరం ప్రారంభం కానుంది. ఇన్నాళ్లూ ప్రచారాలతో హోరెత్తించి, హామీల వర్షం కురిపించిన అభ్యర్థుల భవితవ్యాన్ని సోమవారం ఓటర్లు తేల్చనున్నారు. ఇందుకోసం ఎన్నికల కమిషన్ భారీ ఏర్పాట్లు చేపట్టింది. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి 262 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించారు. ఆదివారం ఇక్కడ పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. 24 సెక్టార్లకు 24 కౌంటర్లు ఏర్పాటు చేసి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం మండలాల్లోని 262 పోలింగ్ కేంద్రాలలో 2500 మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు సహాయంతో పోలింగ్ సామగ్రిని, సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు చేర్చడానికి 48 ఆర్టీసీ బస్సులు, తొమ్మిది మినీ బస్సులు ఉపయోగించారు. ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, నలుగురు సహాయ సిబ్బంది పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తారు. నియోజకవర్గంలోని 67 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు స్థానిక పోలీసులతో పాటు, కేంద్ర బలగాలు, ఆర్‌పీఎఫ్ బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తుంటాయి. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో రాజకీయ నాయకులు ఉండరాదని రిటర్నింగ్ అధికారి జయరాం తెలిపారు. ఉదయం ఏడు గంటలు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఆరు గంటల తర్వాత పోలింగ్ కేంద్రంలో క్యూలో ఎంత మంది ఉన్నా ఓటు హక్కును వినియోగించు కోవచ్చునని వివరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 144 సెక్షన్ అమలులో ఉంటున్నందున జనం గుమిగూడి ఉండకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.


చోడవరంలోని పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద సిబ్బంది కోలాహలం

చోడవరం నియోజకవర్గంలో 243 పోలింగ్ కేంద్రాలు

చోడవరం : నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మరికొద్ది గంటల్లో ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ నిమిత్తం ఇక్కడి నుంచి ఆదివారం మధ్యాహ్నం నాలుగు మండలాలకు ఎన్నికల సిబ్బంది తరలివెళ్లారు. చోడవరం ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద ఆదివారం ఉదయం నుంచే రిటర్నింగ్ అధికారి జి.చిన్నికృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది వివిధ మండలాల నుంచి వచ్చిన ఉద్యోగులకు ఎన్నికల డ్యూటీ ఆర్డర్ కాపీలను అందించడంతో పాటు, ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని అందజేశారు. నియోజకవర్గంలోని చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లోని 243 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, పోలీసులంతా కలిసి 1356మంది సామగ్రితో ఆయా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం నుంచి ఇక్కడి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా పోలింగ్ బూత్‌ల వారీగా స్బిబందికి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లతో పాటు ఇతర ఓటరు జాబితాల సమాచారాన్ని ఉద్యోగులకు అందజేశారు. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి, పోలీసులకు హైస్కూల్ మైదానంలోనే భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం రూట్ అధికారుల ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బంది ఆయా మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు, సామగ్రి తరలింపునకు సంబంధించిన బస్సులు, ఇతర వాహనాలను అధికారులు సమకూర్చారు.

మాడుగుల నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాలు

మాడుగుల రూరల్ : సార్వత్రిక ఎన్నికలకు నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా మాడుగుల పట్టణంలోని ఆర్‌సీఎం పాఠశాలలో ఎన్నికల విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి ఆదివారం రిటర్నింగ్ అధికారిణి సత్యవాణి పర్యవేక్షణలో ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఓటర్లకు సంబంధించిన సమాచార పత్రాలను అందజేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని, సామగ్రిని 47 పీటీడీ బస్సులు, 13 మినీ వ్యాన్‌లు, 13 టాటా మేజిక్ తదితర వాహనాల్లో తరలించారు. మాడుగుల నియోజకవర్గంలో మొత్తం 235 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మాడుగుల మండలంలో ఒకటి నుంచి 69 పోలింగ్ కేంద్రాలు, చీడికాడ మండలంలో 70 నుంచి 116 వరకు, దేవరాపల్లి మండలంలో 117 నుంచి 173 వరకు, కె.కోటపాడు మండలం 174 నుంచి 235 వరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 60 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 24 సెక్టార్లుగా విభజించి 24 మంది సెక్టార్ల ఆఫీసర్లను నియమించారు. పీవోలు, ఏపీవోలుగా 542 మందిని విధులకు వినియోగిస్తున్నారు.

బస్సులు లేక అవస్థలు

- నర్సీపట్నం డిపో నుంచి 80 బస్సులు ఎన్నికల విధులకు కేటాయింపు
- వివిధ ప్రాంతాలకు రాకపోకలకు ప్రయాణికులకు ఇబ్బందులు
- కాంప్లెక్స్‌లో గంటల తరబడి నిరీక్షించి ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు


బస్సులు లేక నర్సీపట్నం కాంప్లెక్స్‌లో ప్రయాణికుల ఇబ్బందులు

నర్సీపట్నం, మే 12 : ప్రజా రవాణా శాఖ నర్సీపట్నం డిపో నుంచి 80 బస్సులను పోలింగ్ సిబ్బంది, సామగ్రి తరలింపునకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నర్సీపట్నం నియోజకవర్గానికి 40 బస్సులు, ఇతర నియోజకవర్గాలకు 40 బస్సులను పంపిచారు. దీంతో ఆదివారం డిపోలో బస్సులు అందుబాటులో లేక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు కాంప్లెక్స్ గంటలకొద్ది వేచి ఉండాల్సి వచ్చింది. విశాఖపట్నానికి రెండు, చోడవరానికి రెండు, తుని, చింతపల్లి, సింగిల్ రూట్లకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 17 బస్సులను మాత్రమే ఆదివారం నడిపారు. రద్దీ ఎక్కువగా ఉండే విశాఖపట్నం రూట్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. తుని, కృష్ణాదేవిపేట, కోటవురట్ల, చోడవరం రూట్లలో ఆటోలలో ప్రయాణం చేయాల్సి వచ్చింది. సోమవారం పోలింగ్ తర్వాత ఈవీఎంలు, సామగ్రిని పటీడీ బస్సుల్లో అనకాపల్లి తరలించాల్సి ఉంటుంది.

వైసీపీ అరాచకాలకు అడ్డేలేదు!

... 5వ పేజీ తరువాయి

డిమాండ్ చేసిన ఆ నాయకులు దానిని రూ.70కి పెంచారు. దీంతో ప్రస్తుతం టన్ను స్లాగ్ ధర రూ.270కి చేరింది.

ప్రజల సొమ్ముతో సొంత లేఅవుట్‌కి వంతెన

రాంబిల్లి మండలం వెంకటాపురం సర్వే నంబర్ 142లోని కొండవాలులో గల జగనన్న కాలనీకి వెళ్లడానికి ఊటగెడ్డపై వంతెన నిర్మాణానికి పంచాయతీ అధికారులు రూ.20 లక్షలు మంజూరు చేస్తే అధికార పార్టీ నాయకుడు ఆ వంతెనను తన కుమారుడు భాగస్వామిగా ఉన్న లేఅవుట్‌కు నిర్మించుకున్నారు. అలాగే అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిలో గల ఏపీ గురుకుల పాఠశాల కోసమని చెప్పి ఆ పక్కనే ఉన్న తన ఎస్టేట్‌కు ఓ ప్రజాప్రతినిధి రోడ్డు నిర్మించుకున్నారు. కాగా వైసీపీకి చెందిన ఓ ఎంపీటీసీ సభ్యుడు సెజ్‌లో ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న పదెకరాలు భూమిలో సాగుచేసుకుంటున్నారు. అందులో ఉన్న రెండు బావుల్లోని నీటిని ట్యాంకర్ల ద్వారా సెజ్ కర్మాగారాలకు సరఫరా చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. అంతే కాకుండా కొందరు వైసీపీ నాయకులు నిర్వాసితుల పేరుతో సెజ్ కర్మాగారాల్లో దందాలు నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పోలింగ్ బూత్‌లకు చేరిన ఈవీఎంలు

మాకవరపాలెం, మే 12 : ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తహసీల్దార్ మురళీమోహన్‌రావు ఆదివారం తెలిపారు. మొత్తం 59 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశామన్నారు. వీటిలో ఎన్నికల విధులకు 118 ఈవీఎంతో 354 సిబ్బంది సాయంత్రానికి చేరుకున్నట్టు చెప్పారు. మండల వ్యాప్తంగా 46,496 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండల వ్యాప్తంగా 54 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం ఎన్నికలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఆయా కేంద్రాలకు ఆదివారం సాయంత్రానికే సిబ్బంది ఈవీఎంలతో చేరుకున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 41545 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి కేంద్రం వద్ద భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

నాతవరం : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నోడల్ అధికారి జె.రాంబాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం నాతవరంతో పాటు పలు గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 65 పోలింగ్ కేంద్రాలలో 390 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నర్సీపట్నం అర్బన్ : ఎన్నికల నిర్వహణకు అధికారులు మండల వ్యాప్తంగా భారీ ఏర్పాట్లు చేపట్టారు. 30 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిపేందుకు ఆదివారం సాయంత్రం సిబ్బంది చేరుకున్నారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రావికమతం : ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. 55,399మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా 61 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీరిలో 28,541 మంది మహిళా ఓటర్లు, 26858 మంది పురుషులు ఉన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో పది మంది చొప్పున 610 మంది ఎన్నికల విధులను నిర్వహించనున్నారని తహసీల్దార్ రమణారావు తెలిపారు. (12ఆర్

రోలుగుంట : మండలంలో 43 పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. మొత్తం 36450 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దార్ రవిచంద్ర తెలిపారు. భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

దేవరాపల్లి : మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. మొత్తం 46,576 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మాడుగుల నుంచి పోలింగ్ సిబ్బంది ఆదివారం ఎన్నికల సామగ్రితో బయల్దేరి రాత్రి ఏడున్నర గంటలకు మండల కేంద్రానికి చేరుకున్నారు. కేంద్ర పోలీసులు బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

కె.కోటపాడు : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మాడుగుల నుంచి ఎన్నికల సామగ్రితో ఆదివారం సాయంత్రానికి సిబ్బందికి ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉన్నతాధికారులు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా తహసీల్దార్, ఎంపీడీవో కోరారు.